సాక్షి
నారాయణపేట
ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



పునాదులు కదిలిస్తాం

ఇథనాల్ కంపెనీ పునాదులు కదిలించే వరకు ఉద్యమిస్తామని హరగోపాల్ అన్నారు.

వివరాలు 8లో ▸



మన్యంకొండలో భక్తజనం

మన్యంకొండ దేవస్థానం శనివారం భక్తజన సందోహంతో కిక్కిరిసింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /19.3

వాతావరణం

ఉదయం చలి తీవ్రత ఉంటుంది. రోజంతా వాతావరణం సాధారణంగా ఉండి, మధ్యాహ్నం ఎండ ప్రభావం చూపుతుంది.

న్యూస్‌రీల్

అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి

నారాయణపేట టౌన్: విద్యుత్ సరఫరాలో కోతలు వారం రోజుల నుంచి రాష్ట్ర రైతాంగాన్ని తీవ్ర ఇబ్బంది కలిగిస్తోందని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అప్రకటిత కోతలు విధించడం, క్రమబద్ధంగా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయకపోవడంతో ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం జిల్లాలో వరినాట్లు వేసుకున్నారని, చేతికి వచ్చిన వేరుశనగ పంట వెలికితీసేందుకు అత్యవరంగా నీరు పెట్టాల్సిన సందర్భం ఇదని అన్నారు. ఇలాంటి సమయంలో విద్యుత్ సరఫరాలో కోతలు ఉండటం వల్ల వరి పంటలకు నీళ్లు సరిగా అందడంలేదని వాపోయారు. రైతుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే విద్యుత్ కోతను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపడతారని హెచ్చరించారు.

పోరాటాల ఫలితంగానే వేతనాల పెంపు



నారాయణపేట టౌన్: పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచిందని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. శనివారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏళ్లుగా మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తీవ్రస్థాయిలో ఉద్యమించడం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాను పెంచి జీఓ నంబర్ 8 ద్వారా విడుదల చేసిందని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకానికి రూ.1200 కోట్లు తగ్గించడం దారుణమన్నారు. అనంతరం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కిరణ్, నర్సింహ మధ్యాహ్న భోజన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా పద్మమ్మ, ఉపాధ్యక్షురాలిగా తిమ్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా నరసింహ, సహాయ కార్యదర్శిగా భాగ్యమ్మ, కోశాధికారిగా నారాయణతోపాటు 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ, నాయకులు డి.నరసింహ, కార్మికులు ఆశమ్మ, లక్ష్మీదేవి, గంగమ్మ, లక్ష్మి, అనసూయ, బాబు, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ టైలరింగ్ పరీక్షలు ప్రారంభం



నారాయణపేట రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని టెక్నికల్ బోర్డు నిర్వహించిన ఆర్ట్ అండ్ టైలరింగ్ కోర్సు పరీక్ష శనివారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైంది. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని జాజాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 104మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ లియాకత్‌అలీ పర్యవేక్షించారు. టీసీసీ లోయర్‌లో 75కు 45మంది, డ్రాయింగ్ లోయర్‌లో 121కి 54మంది, హైయర్‌లో 53కు 3మంది ఉపస్థితి అయినట్లు పరీక్షల విభాగం అధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. మరో మూడురోజుల పాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని చెప్పారు. జీహెచ్‌ఎం రమేష్‌శెట్టి, సిబ్బంది లక్ష్మణ్, అనీఫ్, పర్వీన్‌బేగం, గిరిజ, కతలప్ప, మౌలానా పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలి

నారాయణపేట రూరల్: 317 జీఓ ఆధారంగా జిల్లాకు కేటాయించిన టీచర్లు, బదిలీ కోరుకునే వారు విధిగా తమ సర్వీసు పుస్తకం, సర్టిఫికెట్లతో స్థానిక జ్యోతిరావుపూలే పాఠశాలలో పరిశీలనకు హాజరుకావాలని డీఈఓ లియాకత్ అలీ సూచించారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే ఆ కాపీతో పాటు గత జిల్లాలో పనిచేసిన పాఠశాలకు సంబంధించిన ఆధారాలతో రావాలన్నారు. క్లస్టర్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు డీఈఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఎస్‌ఆర్ వెరిఫికేషన్ చేయించుకుని వెళ్లాలని సూచించారు.

పోడు పట్టాలకు కసరత్తు

నెలాఖరుకల్లా పోడు భూముల రైతులకు హక్కు పత్రాలు

- ఆధారాలు సమర్పించిన రైతులు 20శాతమే
- నాగర్‌కర్నూల్‌లో అత్యధిక పోడు దరఖాస్తులు.. గద్వాలలో నిల్
- జిల్లాస్థాయి కమిటీల ఆధ్వర్యంలో సిద్ధమవుతున్న తుది జాబితా



నారాయణపేట మండలం ఎక్లాస్‌పూర్‌లో సాగైన పోడు భూములను సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: పోడు భూముల దరఖాస్తుల పరిష్కారానికి మోక్షం కలుగనుంది. దశాబ్దాలుగా కలగానే ఉన్న పోడు భూముల సమస్యలను పరిష్కరించి రైతులకు పట్టాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చేపట్టిన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇప్పటికే గ్రామాల వారీగా స్వీకరించిన దరఖాస్తులను డివిజనల్, జిల్లాస్థాయిలో కమిటీల ఆధ్వర్యంలో అధికారులు తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పోడు రైతులకు ఈ నెలాఖరు నాటికి పట్టాల పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ప్రకటించారు. సీఎం ప్రకటనతో ఉమ్మడి జిల్లాలోని పోడు రైతుల్లో ఆశలు నెలకొన్నాయి.

భారీ సంఖ్యలో దరఖాస్తులు..

దశాబ్దాలుగా నలుగుతున్న పోడు భూముల సమస్యల పరిష్కారానికి గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం రైతులను నుంచి దరఖాస్తులను స్వీకరించింది. మొదటగా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించి, రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించింది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో మొత్తం 7,514 దరఖాస్తులు రాగా, మొత్తం 5,417 ఎకరాల భూమిని రైతులు తమ దరఖాస్తుల్లో క్లెయిమ్ చేసుకున్నారు. మహబూబ్‌నగర్‌లో 4,528, వనపర్తిలో 3,164, నారాయణపేటలో 377 పోడు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. అయితే జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎలాంటి పోడు రఖాస్తులు రాలేదు. రాష్ట్రంలో జోగుళాంబ గద్వాలతో పాటు హైదరాబాద్, వికారాబాద్, జగిత్యాల జిల్లాల్లో ఒక్కటి కూడా పోడు దరఖాస్తు రాలేదని అధికారులు వెల్లడించారు.

ఉమ్మడి జిల్లా వారీగా పోడు దరఖాస్తులు, క్లెయిమ్ చేసుకున్న భూమి వివరాలు (ఎకరాల్లో..)

జిల్లా	పోడు దరఖాస్తులు	క్లెయిమ్ చేసుకున్న భూమి విస్తీర్ణం	అర్హులుగా గుర్తించిన దరఖాస్తులు
మహబూబ్‌నగర్	4,528	3,544	114
నాగర్‌కర్నూల్	7,514	5,417	1,950
వనపర్తి	3,164	4,194	311
నారాయణపేట	377	647	08

(జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎలాంటి పోడు భూములు లేవు..)

సర్వేపూర్తి ..

పోడు దరఖాస్తుల పరిష్కారంలో రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ యాక్ట్–2006 కీలకంగా మారింది. దీని ప్రకారం 2005 సంవత్సరం కంటే ముందు సాగులో ఉన్న గిరిజనులు, మూడు తరాల కంటే ముందు నుంచి సాగులో ఉన్న గిరిజనేతరులు తాము పోడు సాగులో ఉన్నట్టుగా ఆధారాలను చూపాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి జిల్లాలో ఎక్కడా 20 శాతానికి మించి రైతులు తగిన ఆధారాలను చూపలేకపోయారు. గ్రామసభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై వివిధ శాఖల సమన్వయంతో అధికారులు క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేశారు. గ్రామసభ ద్వారా తీర్మానం చేసిన దరఖాస్తులపై డివిజనల్, జిల్లాస్థాయి కమిటీల ఆధ్వర్యంలో తుది జాబితా కసరత్తు కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన అర్హుల జాబితాను పరిశీలించి ఈ నెలాఖరుకల్లా మొదటి విడత జాబితాను సిద్ధం చేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది.

ఆనందంగా ఉంది..



తాతలకాలం నుంచి పోడు భూములను సాగు చేసుకుంటున్నాం. మూడు ఎకరాల భూముల్లో పంటలను ఏటా సాగుచేస్తున్నాం. సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇస్తామని ప్రకటించడంతో మాకు చాలా ఆనందంగా ఉంది. పోడు భూముల రైతులకు పట్టాపాసుపుస్తకాలు ఇస్తుండడంతో అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– కిష్ట్యానాయక్, పాతతండా, నారాయణపేట మండలం

తుది దశకు చేరుకుంది..



జిల్లాలో పోడు భూముల దరకాస్తుల పరిశీలన కోసం క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయింది. గ్రామాల వారీగా గ్రామసభలను నిర్వహించి పంపిన తీర్మానాలను డివిజనల్, జిల్లా స్థాయి కమిటీలు ఆమోదించాయి. నిర్ణీత సమయంలోగా మొదటి విడత జాబితాను సిద్ధం చేస్తాం. త్వరలోనే అర్హులైన వారందరికీ పోడు పట్టాలు అందిస్తాం.

– ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

దశలవారీగా హక్కు పత్రాలు

పోడుభూములు సాగుచేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం దశల వారీగా హక్కు పత్రాలను అందించనుంది. ఇప్పటికే నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి జిల్లాలో మొదటి విడత జాబితాను అధికారులు సిద్ధం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 4,528 దరఖాస్తులకుగానూ ఆధారాలు సమర్పించిన 114 దరఖాస్తులే డివిజనల్, జిల్లాస్థాయి కమిటీల ఆమోదానికి వచ్చాయి. వీటిలో ఇప్పటికే కమ్యూనిటీ అవసరాల కోసం వచ్చిన రెండు దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. మిగితా వాటిపై ఈ నెలాఖరుకల్లా నిర్ణయం తీసుకోనున్నారు. నారాయణపేట జిల్లాలో తక్కువగా 377 దరఖాస్తులు రాగా, 8 దరఖాస్తులు జిల్లా కమిటీకి చేరాయి. వనపర్తి జిల్లాలో 3,164 దరఖాస్తులకుగానూ 311 దరఖాస్తులకే రైతులు ఆధారాలను సమర్పించడంతో ఈ మేరకు తుదిజాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

నర్సింగ్ కళాశాల ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావన

నారాయణపేట: జిల్లాకు నర్సింగ్ కళాశాలను మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. జిల్లా ఆస్పత్రి ఎక్కడుంటే అక్కడ నర్సింగ్ కళాశాల మంజూరు చేస్తామని చెప్పడంతో ఈ అకాడమీ ఇయర్ నుంచి ప్రారంభిస్తే బావుంటుందని ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి సమాధానం ఇస్తూ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఫేజ్ త్రీలో నర్సింగ్ కళాశాలను మంజూరు చేస్తామని చెప్పారు.

పరేడ్‌తో శారీరక దృఢత్వం : డీఎస్పీ



నారాయణపేట రూరల్: పోలీసుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని, అందుకు ప్రతి ఒక్కరూ వీక్లీ పరేడ్‌లో భాగస్వాములు కావాలని డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు వీక్లీ పరేడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పోలీసు ప్రతిరోజు వ్యాయామం చేయాలని చెప్పారు. పో లీసు ఆయుధాల గురించి అవగాహన కల్పించా రు. అలాగే నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండాలన్నా రు. సమయపాలన, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. సర్వీసులో ఏమైనా సమస్య లు ఉంటే ఎస్పీని కలిసి పరిష్కరించుకోవాలన్నా రు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించారు. ఆర్ఐ రాఘవరావు, కృష్ణయ్య, సురేష్, శివశంకర్, రిజర్వ్‌డ్ పోలీసులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,039

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగ క్వింటాకు గరిష్టంగా రూ.8,039, కనిష్టంగా రూ.3,150 పలికింది. శనగలు రూ.4,645 పలికాయి. ఎర్ర కందులు క్వింటా గరిష్టంగా రూ.7,559, కనిష్టంగా రూ.6,970 పలికింది. జిల్లాలో కాటన్ మిల్లులో పత్తి క్వింటాల్ గరిష్టంగా రూ.7,700, కనిష్టంగా రూ.4,500 పలికింది.

అక్రమంపై ఉక్కుపాదం



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్న ధన్వాడ పోలీసులు

- జిల్లాలో ఇసుక రిచ్‌లపై కలెక్టర్ తనిఖీలు, ప్రత్యేక నిఘా
- పోలీసు, రెవెన్యూ, మైనింగ్, ఆర్టీఓ అధికారులు అప్రమత్తం
- జిల్లాలో నమోదైన కేసులు 565

నారాయణపేట: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలోనే కలెక్టర్ శ్రీహర్ష జిల్లాలో ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యేకంగా ఇసుక రిచ్‌ల వద్దకు వెళ్లి పరిశీలిస్తున్నారు. అక్రమ రవాణాపై దృష్టి సారించి ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చేస్తున్నారు. ఇసుక అక్రమార్కులకు కళ్లెం వేయాలని స్యాండ్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశంలో స్పష్టం చేశారు. ఇసుక వినియోగదారులు మన ఇసుక–మన వాహనం వెబ్‌సైట్‌లో బుక్ చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు. ఈ ప్రయత్నం సత్ఫలితాన్నిస్తోంది.

రాజకీయాలకు తలొగ్గకుండా..

జిల్లాలో పలువురు రాజకీయ నేతల కనుసన్నల్లో.. పోలీసులు, రెవెన్యూ, మైనింగ్ అధికారుల అండతో ఇదివరకు అక్రమంగా ఇసుక రవాణా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగుతుందనేది బహిరంగ రహస్యమే. గత కలెక్టర్ దాసరి హరిచందన సైతం అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపెందుకు మొదట్లో చర్యలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో అధికార పార్టీ ఒత్తిళ్లతో నిలువరించలేకపోయారు. ప్రస్తుత కలెక్టర్ వస్తూ వస్తూనే అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించడంతో ఒకింత మామూలే అనే అధికార యంత్రాంగంతో పాటు పలువురు అక్రమ ఇసుక రవాణా చేసే వారి కళ్లలో ఇసుక కొట్టినట్లయ్యింది. టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రిచ్‌ల నుంచి కొట్టేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో జేసీబీలు, ఇటాచీలను సైతం కలెక్టర్ రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులతో జరిమానాలు వేయించిన సంఘటనలు ఉన్నాయి. ఆ సమయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పటికీ ప్రభుత్వ నిబంధనల మేరకు వాటికి జరిమానాలు వేసి వదిలేశారు. మళ్లీ అనుమతులు లేకుండా వాగులోకి వస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో అక్రమ రవాణాదారులు హడలెత్తిపోతున్నారు.

జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై నమోదైన కేసుల వివరాలు

ఏడాది	కేసులు	వాహనాలు సీజ్	అరెస్టు
2020	107	203	210
2021	194	350	362
2022	244	265	381
2023	20	20	20
మొత్తం	565	838	973

తహసీల్దార్లదే బాధ్యత..

జిల్లాలోని ఇసుక రిచ్‌లపై కలెక్టర్ ఆకస్మికంగా సందర్శిస్తూ పరిశీలిస్తున్నారు. తమ మండల పరిధిలో ఉండే ఇసుక రిచ్‌లో అక్రమంగా ఇసుకను ఎవరైనా తరలిస్తున్నట్లు తెలిస్తేవెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుకను తరలించాలని సూచిస్తున్నారు. అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

ఆనందంలో జనం..

మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుకను గృహ వినియోగదారులకు సులువుగా తీసుకెళ్లేందుకు (https://tsmiv.cgg.gov.in/home) ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసు కున్న వారికి జిల్లాలో కోయిల్‌కొండ, దామరగిద్ద, మద్దూర్, నారాయణపేట, ధన్వాడ తదితర మండలాలకు ఇసుకను సరఫరా చేసే వీలుకలగడంతో జిల్లాలోని జనం ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి జిల్లాలోని ఇసుక రిచ్‌ల నుంచి టిప్పర్లకు అనుమతులు ఇవ్వడంతో గృహ వినియోగదారులకు ఊరటనిచ్చినట్లయింది.


48 గంటల్లో ఇసుక..

మన ఇసుక మన వాహనం ఆన్‌లైన్ ద్వారా ఇసుక తరలింపునకు వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి ద్వారానే ఇసుకను గృహ వినియోగదారులకు 48 గంటల వ్యవధిలో చేరవేస్తున్నారు. ఊట్కూర్ మండలంలోని ఆగారం, మాగనూర్ మండలంలో అడవిసత్యారం, నేరడ్గాం, వర్కూర్, మక్తల్ మండలంలో చిట్యాల, కోస్గి మండలంలో అమీన్‌కుంట్ల, చెన్నారం బిజ్జారం, మందిపల్లి, ముశ్రీఫా, మద్దూర్ మండలంలో లింగాల్‌చెడ్, మరికల్ మండలంలో పూసల్‌పహడ్, రాకొండలలో ఇసుక రిచ్‌లుగా గుర్తించారు. ఇందులో పలురిచ్‌లకు అనుమతులిస్తూ ఇసుకను రవాణా చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించిన వాహనాలనే అనుమతించి, తరలిస్తున్నారు.

జిల్లాలో నమోదైన కేసులు..

జిల్లాలో నాలుగేళ్లుగా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై పోలీసులు 565 కేసులు నమోదు చేశారు. 838 వాహనాలు సీజ్ చేయగా, 973 మందిని అరెస్టు చేశారు. జిల్లాలోని 12 ఇసుక రిచ్‌లపై కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్, ఆర్టీఓ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎవరైనా రాత్రివేళలో ఇసుకను తరలించే ప్రయత్నం చేస్తే వాహనాలు సీజ్ చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం..



జిల్లాలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు తప్పవు. రెవెన్యూ, ఆర్టీఓ, మైనింగ్ శాఖల సమన్వయంతో పోలీస్ అధికారులతో ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రజలు కూడా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారి గురించి తెలిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.

– ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్పీ




స్యాండ్ కమిటీ సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష (ఫైల్)

సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ రఫీ

నారాయణపేట: సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అబ్దుల్ రఫీ కక్షిదారులకు సూచించారు. జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకొని శనివారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు గ్రామాల్లో పంచాయతీ కట్ట అనేది ఉండేదని, ఇరుపక్షాలను కూర్చోబెట్టి గ్రామ పంచాయతీలోనే పెద్దలు సమస్యను పరిష్కరించే వాళ్లని గుర్తు చేశారు. అదేవిధంగా ఇప్పుడు కోర్టులో సైతం లోక్‌అదాలత్ ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ ధోరణితో ఇద్దరు కక్షిదారులు కలిసి ముందుకు వచ్చి తమ కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. జిల్లా ఏర్పాటై నాలుగేళ్లు అవుతుందని, జిల్లా కోర్టు ఏర్పాటై 8నెలలు పూర్తయ్యిందని అన్నారు. మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పెండింగ్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి, పిపి సురేశ్ కుమార్, బార్‌అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్‌గౌడ్, న్యాయవాదులు సీతారాం, రఘువీర్‌యాదవ్, నారాయణ, లక్ష్మీపతి, రాజవర్ధన్‌రెడ్డి ఉన్నారు.



క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

బల్మూర్: మొక్కజొన్న పంటకు బోరునీరు పారిస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూర్ మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివానం దంగౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మొల్గర తిరుపతయ్య(50)కి గోదల్ శివార్‌లో ఉన్న వ్యవసాయ పొలంలో యాసంగి పంటగా మొక్కజొన్న సాగుచేస్తున్నాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం స్ప్రింక్లర్ల సాయంతో పంటకు నీరు పారిస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోరుకు లాగిన విద్యుత్ తీగలకు ఏమరు పాటుగా పైపులు తగలడంతో రైతు తిరుపతయ్య నీటిద్వారా వచ్చిన కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీన్ని గమనించిన మృతుని తండ్రి ముత్తయ్య కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. మృతుని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైతుకు ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగుల శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్(22) దుర్మరణం పాలయ్యాడు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం .. వంగూరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన పవన్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మండలంలోని రఘుపతిపేటలో జరిగిన ఓ శుభకార్యంలో ఫొటోలు తీసి.. ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి తిరిగి వస్తున్నాడు. 7.30 గంటల ప్రాంతంలో రోడ్డు మధ్యలో నిలిపి ఉన్న లారీని పవన్ వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై పవన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని మహిళ మృతి

బాలానగర్: రైలు ఢీకొని ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పెద్దాయపల్లి గ్రామ శివారులోని రైల్వే ట్రాక్‌పై శనివారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల పరిధిలోని పెద్దాయపల్లికి చెందిన జుట్టు కృష్ణవేణి(37) శనివారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల సమయంలో రైలు ఢీకొని మృతిచెందింది. మృతురాలు భర్త దశరథ్ 3 సంవత్సరాల కిందట మృతిచెందాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆమె శనివారం రైలు ప్రమాదంలో మృతిచెందినట్లు రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ పేర్కొన్నారు. మృతురాలికి 12 సంవత్సరాలలోపు ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు సమాచారం.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

అడ్డాకుల: మండలంలోని రాచాలకు చెందిన ఓ యువతి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ విజయకుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తపస్వీని(30) నాగాయపల్లికి చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. ఇద్దరు కలిసి పెళ్లి చేసుకోవాలని భావించగా, సదరు యువకుడికి పెళ్లి నిశ్చయం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన తపస్వీని శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం చేరవేయడంతో శనివారం తపస్వీని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతురాలి సోదరి తేజస్వీని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా మృతురాలికి తల్లిదండ్రులిద్దరూ మృతి చెందినట్లు తెలిసింది.

రూ.లక్షల్లో పెట్టుబడి.. రూ.వేలల్లో ఆదాయం

- తరుచుగా మూతపడుతున్న మిల్లెట్ యూనిట్
- ప్రారంభం కాని బిస్కెట్ యూనిట్
- ఊసేలేని మురుక్కు తయారీ

గండేడ్: కేంద్ర ప్రభుత్వం చిరుధాన్యాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏడాదిని అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ప్రకటించి ప్రాచుర్యం కల్పిస్తుంది. హరిత విప్లవం ద్వారా ఆహార భద్రతపై దృష్టి సారించడంతో చిరుధాన్యాల ఆహారాన్ని ప్రజలు మరిచిపోయారు. మళ్లీ ప్రజలు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ప్రోత్సాహం కొరవడింది. మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి మిల్లెట్ యూనిట్ ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించాలని సంకల్పించారు. ఇందులో భాగంగా మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ మిషన్ కింద రూ.24.5 లక్షలతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. దీని నిర్వాహణకు గాను బోర్డు ఆఫ్ డైరెక్టర్లను నియమించారు. దీని ప్రకారమే మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన యూనిట్‌లో 9 రకాల మిషన్లను అమర్చారు. వీటిలో మురుక్కుల తయారీ, బిస్కెట్, రొట్టెల తయారీ, పిండి మరలు, గ్రైండర్లు ఉన్నాయి. మిల్లెట్లలో ప్రొటీన్, ఫైబర్, ఐరన్ అధికంగా ఉంటాయి. షుగర్ వ్యాధి రాకుండా, వచ్చిన వారికి సైతం మంచి ఆహారంగా ఈ చిరుధాన్యాలు ఉపయోగపడుతాయి. వీటి ద్వారా రొట్టెలు, ఉప్మా, మురుక్కులు, బిస్కెట్ తయారు చేయొచ్చు. దీంతో ప్రస్తుతం చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకొని పలు రకాల వస్తువులు తయారు చేస్తే చక్కటి లాభాలు ఉంటాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ యూనిట్ నిర్వహణ సజావుగా సాగడం లేదు.

పనిచేయని మురుక్కు యంత్రం..

మురుక్కు యంత్రం పనిచేయడం లేదు. యూనిట్ ప్రారంభ సమయంలో ఇది పని చేసింది. దీనికి సంబంధించి మహిళలకు శిక్షణ కూడా ఇచ్చారు. కొన్ని రోజులు సక్రమంగా పనిచేసిన ఇది తర్వాత కాస్త మూలనపడింది. కొర్రలు, ఊదలు, అండుకొర్రల కోసం ఏర్పాటు చేసిన మిషన్లు సైతం నిరుపయోగంగా ఉన్నాయి.



మూతపడ్డ మిల్లెట్ యూనిట్



పనిచేయని మురుక్కు యూనిట్

తరుచుగా మూతపడుతున్న యూనిట్

పెద్ద మొత్తంలో ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన యూనిట్ తరుచుగా మూతపడుతుంది. ఈ యూనిట్‌లో కేవలం రొట్టెల తయారీ ఒక్కటే నడిచేది. అది కూడ కొంత కాలంగా సక్రమంగా నడవడం లేదు. ఆరు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. జొన్నలు లేవని, గిరాకీ లేదని, కూలీ గిట్టుబాటు కావడం లేదని ఇలా రకరకాల కారణాలతో మూసేస్తున్నారు. జనవరిలో తండాల్లో గిరిజనుల పండుగలు ఉండడంతో కొన్నిరోజులు మాత్రం నడిచింది. తిరిగి గిరాకీ లేదని మూసేశారు. ప్రస్తుతం ఐదుగురు మహిళలు పనిచేస్తున్నారు. నెలలో 15రోజులు కూడా నడవకపోవడంతో వీరు ఉపాధి కోల్పోతున్నారు. ఇచ్చేది రూ.250 అయినా అది నెల మొత్తం లేకపోవడంతో కుటుంబాలు ఎలా గడుస్తాయని వాపోతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెడితే కనీసం రూ.వేలల్లో ఆదాయం సమకూరడం లేదు.

ఊసేలేని శిక్షణ..

ఈ యూనిట్ ప్రారంభంలో తూతూ మంత్రంగా శిక్షణ ఇచ్చారు. 15 రోజుల పాటు శిక్షణ అని చెప్పి రెండు, మూడు రోజులు కూడా సక్రమంగా ఇవ్వలేదు. తర్వాత కొన్నాళ్లపాటు మూతపడ్డాక తిరిగి ప్రారంభించి మళ్లీ 15 రోజుల శిక్షణ అని చెప్పి కనీసం ఒక్క రోజు కూడా ఇవ్వలేదు. ఒక్కసారి మాత్రం కోయంబత్తూర్ నుంచి మెకానిక్‌ను తీసుకువచ్చి మరమ్మతు చేయించారు. కాని అవి మళ్లీ మొదటకు వచ్చాయి.

సమాచారం ఇస్తే తొలగిస్తాం...

మిల్లెట్ యూనిట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో దీని సమాచారం బయటకు పొక్కితే తొలగిస్తామని ఐకేపీ ఉత్పత్తిదారుల సంఘం మహిళలపై అధికారులు బెదిరింపులకు దిగుతున్నారు. గతంలో పలు పత్రికల వారికి, టీవీలకు తమ అభిప్రాయాన్ని చెప్పారు. ఇంకోసారి చెబితే మీ బదులు కొత్తవారిని పెడతామని చెప్పడంతో ఏ సమాచారం చెప్పాలన్న మహిళా సంఘం సభ్యులు జంకుతున్నారు.

పది రోజుల్లో ప్రారంభిస్తాం

తక్కువ ధరకు మురుక్కులు మార్కెట్లో అమ్మడానికి ప్రణాళిక చేస్తున్నాం. బిస్కెట్ మిషన్‌ను మరమ్మతు చేసి పది రోజుల్లో ప్రారంభిస్తాం. రొట్టెలు ప్రైవేట్ వ్యక్తులు తక్కువ ధరకు అమ్మడం వల్ల గిరాకీ తగ్గింది. దీంతో కూలీ డబ్బులు ఇవ్వడానికి ఇబ్బంది తలెత్తుతుంది. ఈ యూనిట్ నిర్వహణ పూర్తిగా మహిళా సంఘానికి అప్పగించి వారే పూర్తి స్థాయిల కొనసాగించేలా చూస్తాం. వేసవిలో కూడా రాగి సంకటి, రాగి మురుక్కులు తయారు చేసి ఆదాయాన్ని పెంచేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. త్వరలో సీఈఓను నియమిస్తాం. తాము ఎవరినీ బెదిరించలేదు.

– అనిల్, డీపీఎం, మహబూబ్‌నగర్

అలంకారప్రాయంగా బిస్కెట్ తయారీ యంత్రం

యూనిట్ ప్రారంభమై రెండేళ్లు కావస్తున్న బిస్కెట్ యూనిట్‌కు మోక్షం కలగడం లేదు. చిరుధాన్యాలతో తయారు చేసిన వీటి ధర చౌకగా ఉండడమే కాక ఆరోగ్యానికి శ్రేయస్కరం కావడంతో వీటిని కూడా తయారు చేయాలని అనుకున్నారు. ఏర్పాటు చేసిన నాటి నుంచి ఒక్క బిస్కెట్ తయారు చేయలేదు. సాంకేతిక సమస్య ఉండడంతో ఇది నిరుపయోగంగా ఉంది. ఈ విషయం పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదు. ఈ యూనిట్‌కే అన్నింటికంటే ఎక్కువ ధర ఈ మిషనే.



నిరుపయోగంగా ఉన్న బిస్కెట్ యూనిట్

లోక్ అదాలత్‌లో 2,551 కేసుల పరిష్కారం



చెక్కులు అందజేస్తున్న జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి

పాలమూరు: జాతీయ సేవా సంస్థ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని దీంట్లో రాజీ అయ్యే అన్ని రకాల కేసులను పరిష్కరిస్తున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి అన్నారు. జిల్లా కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి 3,700 కేసులు గుర్తించామని, హైకోర్టు ప్రత్యేకంగా 7 కేసులను రాజీ చేయాలని సూచిస్తే ఆ మేరకు పార్టీలకు సమాచారం అందించామని చెప్పారు. హైకోర్టు కేసులను సైతం ఇక్కడే రాజీ చేయడం వల్ల కక్షిదారులకు ప్రయాణ, ఇతర ఖర్చులను ఆదా చేసినట్లు అవుతుందన్నారు. జాతీయ సేవా సంస్థ కల్పిస్తున్న ఇలాంటి అవకాశాన్ని చాలా రోజులుగా పెండింగ్‌లో ఉండే ఆయా కేసుల కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు, ఫ్యామిలీ కోర్టు, మూడో అదనపు న్యాయమూర్తి నీరజ, ఇన్‌చార్జ్ రెండో అదనపు, నాలుగో అదనపు న్యాయమూర్తి వై.పద్మ, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సంధ్యారాణి, ప్రిన్సిపల్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎంకే పద్మావతి, ఇతర న్యాయమూర్తులు శిరీష, నిర్మల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి పాల్గొన్నారు.

■ జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి కోర్టుతోపాటు జిల్లా పోలీస్ శాఖ కలిపి 3,700 కేసులు గుర్తించారు. మహబూబ్‌నగర్ కోర్టులో నాలుగు బెంచీలు, జడ్చర్ల కోర్టులో ఒక బెంచీ ఏర్పాటు చేసి శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 3,700 కేసులలో లోక్ అదాలత్ ద్వారా 2,551 కేసులు పరిష్కరించారు. దీంట్లో కొందరికి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది.

రైతులపై ఇసుకాసురుల దాడులు




రైతులు అడ్డుకోవడంతో వాగు వద్దే పోసిన ఇసుక

మహమ్మదాబాద్: అక్రమ ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులపై ఇసుకాసురులు దాడులకు తెగబడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగంపేటకి చెందిన రాంరెడ్డి, నర్సింహారెడ్డిలకు చెందిన పొలం అన్నారెడ్డిపల్లి శివారులో వాగును ఆనుకొని ఉంది. అయితే కొంత కాలంగా ఇక్కడి నుంచి రాత్రి వేళలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన రైతులు శుక్రవారం రాత్రి కాపుకాశారు. కంచన్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి ఇసుకను అక్రమంగా తరలించుకుపోవడానికి రెండు ట్రాక్టర్లు తీసుకొచ్చి నింపాడు. ట్రాక్టర్లు తీసుకెళ్లే సమయంలో సంబంధిత రైతులు అడ్డుకున్నారు. దీంతో సదరు అక్రమ వ్యాపారీ కూలీలతో కలిసి వారిపై దాడికి యత్నించాడు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రైతులు ఇద్దరే ఉండటం అక్రమ వ్యాపారీ వర్గం ఎక్కువగా ఉండి దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. చివరకు చేసేది లేక ట్రాక్టర్లు ఖాళీ చేసి అక్రమార్కులు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల అండతో అక్రమ వ్యాపారం జరుగుతుందని, వారి అండదండలతోనే దాడులకు పాల్పడుతున్నారని బాధితులు ఆరోపించారు.

అర్హత లేకున్నా నియామకాలు?

- అలంపూర్ ఆలయ అధికారులపై నేతల ఒత్తిళ్లు
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు డిమాండ్



అలంపూర్ ఆలయాల సముదాయం

జోగుళాంబ శక్తిపీఠం: ఇటీవల ఔట్ సోర్సింగ్ పద్ధతిన 8 పోస్టులు మంజూరు కావడంతో అలంపూర్ జోగుళాంబ ఆలయంలో పైరవీల జోరు ఊపందుకుంది. తమ వారిని ఉద్యోగులు నియమించేందుకు కొంత మంది ఆలయంతో ప్రత్యక్ష అనుబంధాలు కలిగిన రాజకీయనేతలు రంగప్రవేశం చేశారు. రోజుకు 10 నుంచి 15 మంది దాకా తమ వారికి ఉద్యోగాలు ఇప్పించాలని గట్టి ప్రయత్నాలు చేస్తూ ఒత్తిళ్లు తెస్తున్నారు.

చాలా వరకు అక్రమ నియమకాలే..

దేవాదాయ శాఖలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో చాలా వరకు అక్రమ నియామకాల పరంపర కొనసాగుతూనే వస్తుంది. ఆలయంలో రెగ్యులర్ ఎంప్లాయిస్, ఔట్ సోర్సింగ్, దినసరి కూలీలు ఇప్పటికే 54 మంది కొనసాగుతున్నారు. ఇవికాక ప్రసాదాల తయారీ కేంద్రంలో పులిహోర కలిపేందుకు, లడ్లు, పులిహోర ప్రసాదాల ప్యాకింగ్ పేరిట దినసరి కూలీలు మరి కొంత మంది మూడేళ్లుగా ఆలయంలో కొనసాగుతూనే ఉన్నారు. ఇదిలా ఉండగా ఆలయంతో ప్రత్యక్ష సంబంధం కలిగిన మాజీలు కొందరు తమవారంటూ ఏపీలోని కర్నూలు జిల్లా నుంచి ఇద్దరు వ్యక్తులను తీసుకొచ్చి వారికి ఉద్యోగాలు ఇవ్వాలని ఏకంగా ఈఓ, చైర్మన్‌లకే ఒత్తిడి చేశారు. తాజాగా శనివారం అలంపూర్ పట్టణంలోని ఓ వ్యక్తి ఈఓ వద్దకు వచ్చి తన కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలని మంత్రి, ఎమ్మెల్యేలతో కూడా ఫోన్ చేయించా.. ఎందుకు ఆలస్యమవుతుందని ప్రశ్నించడం కొసమెరుపు.

మాకు సంబంధం లేదు



ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై చాలా మంది ఒత్తిడి చేస్తుండడం వాస్తవమే. అయితే ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలు ఏజెన్సీకే సంబంధం ఉంటాయి. ఏజెన్సీ ద్వారా వచ్చే ఉద్యోగాలతో ఆలయానికి ఎలాంటి సంబంధం ఉండదు. అతడి వేతనాలు కూడా ఏజెన్సీ వారే ఇస్తారు. అక్రమ నియామకాల విషయంలో వస్తున్న ఆరోపణలు సరికాదు.

– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

పూడ్చిన శవానికి పోస్టుమార్టం



గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో శనివారం పూడ్చిన శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించారు. బల్గెర గ్రామానికి చెందిన డ్రైవర్ సునంద్(35) ఈనెల 8న బల్గెర గ్రామ సమీపంలో రోడ్డు పక్కన అనుమానాస్పదంగా మృతి చెందాడు. సునంద్ మృతదేహాన్ని తీసుకు వచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే సునంద్ తండ్రి ఫ్రాన్సిస్‌కు కుమారుడి మృతిపై అనుమానం ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ పవన్‌కుమార్, తహసీల్దార్ రవికుమార్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. అనంతరం గద్వాల నుంచి వచ్చిన వైద్యబృందం సునంద్ మృతదేహాన్ని వెలికి తీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

BREAKING NEWS
కోచింగ్ + హాస్టల్ ఉచితం
రామ బాణానికి ఎదురులేదు
G.T.కోచింగ్‌కు తిరుగులేదు
3,4,5,6,7,8వ తరగతి వారికి
గురుకుల
దరఖాస్తు చివరి తేది:16-03-2023
కొత్తకోట 9985431451

పట్టువస్త్రాల తయారీకి తరలివెళ్లిన పద్మశాలీలు



పట్టువస్త్రాలను తయారు చేసేందుకు వెళ్తున్న పద్మశాలి కులస్తులు

అమరచింత: జ్యోతిర్లింగాల్లో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైల మల్లికార్జున స్వామికి పట్టువస్త్రాలను సమర్పించేందుకు అమరచింత పద్మశాలి కులస్తులు శనివారం ప్రత్యేక వాహనంలో శ్రీశైలానికి తరలివెళ్లారు. పట్టణంలోని శివ చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి పట్టువస్త్రాల తయారీకి వినియోగించే మగ్గంతో పాటు పట్టు, నూలును ఇక్కడి నుంచి మేళాతాళాలతో ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. కొన్నేళ్లుగా శివరాత్రికి శ్రీశైల మల్లన్నకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టువస్త్రాలను ప్రత్యేక మగ్గంపై తయారు చేసి సమర్పించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని మహంకాళి సత్యనారాయణ, తిరుమల శ్రీనివాసులు తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శనివారం పూర్తి నీటి మట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా 60 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ఇథనాల్ కంపెనీ పునాదులు కదిలిస్తాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

- చిత్తనూర్‌లో ప్రారంభమై లంకాలకు చేరుకున్న పాదయాత్ర
- మద్దతు తెలిపి మాట్లాడిన ప్రొఫెసర్ హరగోపాల్

మరికల్: రైతులు, ప్రజలకు ఇబ్బందికలిగించే ఇథనాల్ కంపెనీ పునాదులు కదిలించే వరకు ఉద్యమిస్తామని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. కంపెనీ రద్దు కోరుతూ బాధిత గ్రామాల ప్రజలు శనివారం చిత్తనూర్ నుంచి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. గ్రామాల్లో పొలాల మధ్య విషపూరితమైన కంపెనీలు పెట్టడం సరైంది కాదన్నారు. పెట్టుబడిదారులు, రాజకీయ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఇటువంటి కంపెనీలను ఏర్పాటు చేయించి, ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారని మండిపడ్డారు. ఈ కంపెనీ వల్ల వన్యప్రాణులకు, మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉందన్నారు. తీవ్రమైన పరిణామాలపై బాధిత గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన పాదయాత్ర మంచి నిర్ణయమని అన్నారు. ఇందుకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

పాదయాత్ర సాగుతుంది ఇలా..

మండలంలోని చిత్తనూర్ శివారులో గల ఇథనాల్ కంపెనీ వల్ల కలిగే నష్టాలను వివరించడానికి ఐదు మండలాలు 54 గ్రామాలు, 11 రోజులుగా పాదయాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు చిత్తనూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర దమాజ్ఞాపూర్, పర్కపూర్, కుమార్‌లింగంపల్లి, రాంపూర్, లంకాలకు చేరింది. అనంతరం నర్వ, ఉందేకోడ్, పాతర్‌చేడ్, జంగంరెడ్డిపల్లి, బుడ్డెగానితాండ, గాజులయ్యతండా, కన్మనూర్, ఎక్లాస్‌పూర్, జిన్నారం, బండమీదితండా, ఇబ్రహీంపట్నం, మరికల్, ఎలిగండ్ల, ఎమ్మోనోనిపల్లి, గున్ముక్ల, కంసాన్‌పల్లి, ధన్వాడ, మందిపల్లి, అప్పంపల్లి, మాధవరం రాంకిష్టాయ్యపల్లి, కిష్టాపూర్, గోటూర్, కోయిల్‌సాగర్, కోండ్రోనిపల్లి, పూసల్‌పహాడ్, రాకొండ, బండర్‌పల్లి, పెద్దచింతకుంట, లాల్‌కోట, పల్లమర్రి, పర్దిపూర్, సీతారాంపేట, నెల్లికొండి, వడ్డెమాన్, చిన్న వడ్డేమాన్, ఏదులాపురం, చిన్నచింతకుంట, మద్దూర్, కురుమూర్తి, అమ్మపూర్, దుప్పల్లి, కొత్తపల్లి, మదనాపురం, తిర్మలాయపల్లి, రామన్‌పాడ్, ఆత్మకూర్ వరకు సాగనుంది. యాత్రలో ఆయా గ్రామాల సర్పంచ్‌లను, అక్కడి ప్రజలను కలిసి కంపెనీ వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పిస్తామ, వారిని కూడా కలిసి రావాలని కోరతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈ పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్రాములు, సుదర్శన్, కేఎన్‌పీఎస్ కన్వీనర్ లక్ష్మయ్య, చంద్రశేఖర్, నాగేష్, నాగరాజు, మురళి, మణివర్ధన్‌రెడ్డి, సంతోష్, సరోజన పాల్గొన్నారు.

గానుగ నూనె జయమ్మ మృతి



జయమ్మ (ఫైల్)

గండేడ్: గానుగ నూనె తయారీతో ఎంతో పేరు తెచ్చుకున్న కోట్ల జయమ్మ(62) శుక్రవారం మృతిచెందింది. వివరాలిలా.. గండేడ్ మండల జక్లపల్లికి చెందిన కోట్ల జయమ్మకు 2018లో రొమ్ము క్యాన్సర్ బారినపడింది. అయితే ఇది ఫిల్టర్ నూనుల వల్ల వస్తుందని.. వాటిని మాని వేసి గానుగ నూనె వాడాలని వైద్యులు సూచించారు. దీంతో సొంతంగా గానుగ ఏర్పాటు చేసి.. పల్లి, కొబ్బెర, అవిసె, కుసుమ, నువ్వులతో నూనె తీయడం ప్రారంభించారు. రెండుసార్లు బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ సైతం కావడంతో కల్తీలకు స్వస్తి పలకాలని సంకల్పించింది. ఇక్కడి నుంచి విదేశాలకు సైతం గానుగ నూనె తీసి ఎగుమతి చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వి-హబ్ వారు మహబూబ్‌నగర్‌లో శిక్షణతో నూనె వ్యాపారాన్ని విస్తరించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ సహకారంతో దుబాయ్, సింగపూర్, మలేషియాలకు పంపి పేరు తెచ్చుకుంది. ఈ క్రమంలోనే మరోమారు అనారోగ్యానికి గురైన ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందగా.. శనివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. గానుగ నూనె జయమ్మగా పేరుగాంచిన ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
■ వెంచర్ కోసం 100% క్లియర్ టైటిల్ ల్యాండ్స్ డెవలప్‌మెంట్‌కి కావలెను. Wanted 100% Clear Title Lands for Ventures on Development. Ph : 76718 86273 [V-5633]

LAND FOR SALE
■ నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట - తెల్కపల్లి మధ్య గట్టుతుమ్మెన్ గేటు వద్ద SH 20 మెయిన్ రోడ్డుకు ఒక ఎకరం పొలం అమ్మబడును. సంప్ర॥, సెల్: 7868846788.

HOUSE FOR SALE
■ మహబూబ్‌నగర్ పట్టణంలో రాంనగర్ నందు తూర్పు ఫేసింగ్ ఇల్లు అమ్మకానికి కలదు సంప్రదించవలసిన సెల్ నంబర్: 7895881234

PLOT FOR SALE
■ హైదరాబాద్, ఇబ్రహీంపట్నం-జనహర్ష డ్రీమ్ సిటీ- 1 & 2లోని ప్లాట్లు అమ్మబడును. మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345

SERVICES

BUSINESS OFFER
■ పర్మినెంట్ బిజినెస్ పర్సన్ పెట్టుబడిలోనే లైఫ్ టైమ్ మాస్టర్ ఫ్రాంచైజ్ లీడింగ్ మల్టీ బిజినెస్ ... +15 సం॥ల అనుభవం. ఫోన్ : 9908749808

HEALTH CARE
ORTHOPEDIC SURGEON
■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (Ortho) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. ... అపోలో హాస్పిటల్ ప్రక్కన, 8వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666

GYNECOLOGY
■ కార్తీక్ హాస్పిటల్, నంద్యాల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజీషియన్, డా॥ పార్వతీ దేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపీ నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

WANTED
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, రోస్ట్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం. 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646.
■ వరంగల్‌లోని బిజినెస్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 18000+రూం + భోజనం ఫ్రీ. సెల్: 6281342090, 9949857816.
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ J Group కంపెనీ హైదరాబాద్‌లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువకులు కావలెను. Age: 18 to 30, సాలరీ: 14,000/- to 40,000/-+ కమీషన్. Qualification: 10th, Inter, Degree. ఫోన్: 9666610433.

సాక్షి ద్వారా మీ ఆత్మీయులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)
HAPPY BIRTHDAY

సాక్షి భవిత విద్యార్థుల కోసం

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం ఇవ్వవలసిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రీతిలో ... ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీగిరి ఆలయంలో ఆగమశాస్త్రానుసారం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు బ్రహ్మోత్సవాలకు నాయకత్వం వహించే చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి బ్రహ్మోత్సవ క్రతువుకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సాయంత్రం ధ్వజారోహణ, భేరిపూజ కార్యక్రమాలు నిర్వహించి ధ్వజాపతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లు భృంగివాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు.

జ్యోతిర్ముడి భక్తులకు 15 వరకే స్పర్శదర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని శివమాల ధరించి జ్యోతిర్ముడితో వచ్చిన వారికి మాత్రమే ఈ నెల 15 వరకు మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు దేవస్థాన ఈవో ఎస్.లవన్న తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు భక్తులందరికీ మల్లికార్జున స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అది టీడీపీ అసత్యాల పుస్తకం

- ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు
- రచన, ప్రచురణకర్త లేని పిరికి పందల పుస్తకం
- వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కోరిందే సీఎం వైఎస్ జగన్
- మరి ఆరోజు టీడీపీ ఎందుకు దర్యాప్తు చేయలేకపోయింది?
- మీలాంటి నీచులతో రాజకీయాలు దురదృష్టకరం

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై విడుదల చేసింది టీడీపీ అసత్యాల పుస్తకం అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. వయసు మీద పడిన చంద్రబాబు ఒక అజ్ఞాని అని ఆ పుస్తకం నిరూపిస్తోందన్నారు. విషపు రాతలతో ఒక పుస్తకాన్ని అచ్చేసి బయటకు వదిలారని, రాజకీయాల్లోకి ఆడవాళ్లను కూడా లాగి వివాదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ పుస్తకంపై టీడీపీ, చంద్రబాబు పేర్లు పెట్టుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు ఓ పిరికిపంద అని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ రోజు మీరు ఏం చేశారు?

- టీడీపీ విడుదల చేసిన పుస్తకాన్ని ఎవరు ప్రచురించారు? ఎన్ని కాపీలు వేశారు? అన్న కనీస వివరాలు లేవు. పైగా అదేదో అంతర్జాతీయ పార్టీ అయినట్లు ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో విడుదల చేయడం మరో తమాషా. నిజంగా దమ్ముంటే



ప్రచురణకర్త, ఎక్కడ, ఎన్ని కాపీలు ముద్రించారు వంటి పూర్తి వివరాలు అందులో ఉటంకించాలి కదా చంద్రబాబూ? అంత పిరికిపంద వా?

- ఆ పుస్తకంలో మీరు రాసినవన్నీ అసత్యాలని మీకూ తెలుసు. మీరెన్ని అసత్యాలు రాసినా సీఎం ప్రతిష్టను, నిజాలను ఏమార్చలేరు. అవి తప్పుడు రాతలని, విషపు రాతలని చంద్రబాబే ఒప్పుకుంటున్నాడు.
- వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు సీఎం ఎవరు? ప్రభుత్వం ఎవరిది? తప్పుడు రాతలతో విషం చిమ్మే బదులు.. వివేకా కుమార్తెను, భార్యను, అల్లుడిని.. ఊళ్లో ఉన్న ఆయన కుటుంబాన్ని ఎందుకు విచారించలేదు? అప్పుడున్నది మీ ప్రభుత్వమే కదా?
- ఎంపీ అవినాష్‌రెడ్డి ఆనవాళ్లు చెరిపించాడంటే నువ్వు, నీ డీజీపీ, ఏబీ వెంకటేశ్వరరావు, పోలీసులు ఏం చేశారు? ఆ రోజు వివేకానందరెడ్డి కుమార్తె వాంగ్మూలం ఎందుకు తీసుకోలేదు. అప్పుడు నీది చేత కాని ప్రభుత్వమా? లేక తప్పుడు ప్రభుత్వమా?

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్టీఆర్, కోడెలపై పుస్తకం ఎందుకు వేయలేదు?

- ఎన్టీఆర్ మృతిపై భార్య లక్ష్మీపార్వతి, ఆయన కుమారుడు హరికృష్ణ సీబీఐ దర్యాప్తు కోరితే సీఎంగా ఉన్న నువ్వు కనీసం సీబీసీఐడీ దర్యాప్తు అయినా చేయించావా? మరి అప్పుడిలా పుస్తకం ఎందుకు వేయించలేదు? ఎన్టీఆర్ పతనం, కుట్ర, కుతంత్రం, వెన్నుపోటు, వీటన్నింటిపై పుస్తకం వేయాలి. సీబీఐ దర్యాప్తు జరగాలి.
- అవినాష్ రెడ్డి సీబీఐకి ఇచ్చారని నువ్వు చెబుతున్న వాంగ్మూలం నీకు ఎక్కడి నుంచి వచ్చింది? అంటే సీబీఐ బాబు ఆదేశానుసారం నడుస్తోందని భావించాలా.. ఆ స్టేట్‌మెంట్ నువ్వు అచ్చేయగలిగావంటే నీ మార్గనిర్దేశకత్వంలో సీబీఐ నడుస్తోందనుకోవాలి.
- నీ పార్టీ సీనియర్ నేత కోడెల శివప్రసాదరావు బలవన్మరణంపై పుస్తకం ఎందుకు వేయలేదు? ఆ మరణం వెనుక నీ ప్రమేయం లేకపోతే కోడెల ఫోన్‌ను తెలంగాణ పోలీసులకు ఎందుకివ్వలేదు? ఆ ఫోన్‌ను ఎందుకు ధ్వంసం చేయించావు? నీ పాపాలు బయటకు వస్తాయనే కదా! ఎన్టీఆర్ కుమార్తె మరణంపైనా సీబీఐ దర్యాప్తు వేయాలి కదా?

నీ సంస్కారం ఇదేనా?

- నీ ఇంట్లో వారే ఆడవాళ్లా. ఇతర కుటుంబాల్లోని ఆడవాళ్లకు ఆత్మాభిమానం, పరువు ప్రతిష్టలు ఉండవా? వైఎస్ భారతమ్మ ఫొటో పుస్తకంలో ప్రచురిస్తావా? ఏం నీచపు బుద్ధి నీది? 23 మంది ఎమ్మెల్యేలను కొన్నా, జగన్‌మోహన్‌రెడ్డిని మానసికంగా కుంగదీయలేకపోయావు. నీ వల్ల కాక బీజేపీ నాయకులు, నువ్వు దత్తత తీసుకున్న వారితో అవాకులు చవాకులు మాట్లాడిస్తున్నావు.
- ఎక్కడో యూట్యూబ్‌లో నీ భార్యను ఎవరో ఏదో అన్నారంటూ.. ఒకటే ఏడ్పులు. ఇంత వయసొచ్చిన నీ సంస్కారం ఇదేనా? ఇంత నీచ, కిరాతక, హేయమైన రాజకీయ నాయకు కుడితో పోటీగా రాజకీయాలు చేయాల్సి రావడం మా దురదృష్టకరం. తెలుగుకు తెగులు పట్టిస్తున్న చదువు సంధ్యలు లేని నీ కొడుకు లోకేశ్‌ను ఊరి మీదికి వదిలి కామెడీ చేయిస్తున్నావు.

విద్యాలయాలుగా ఆర్బీకేలు

యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా కూడా మారిన ఈ కేంద్రాలు



కాకినాడ జిల్లా జి.రాగంపేట ఆర్బీకే వద్ద వర్మీకంపోస్ట్ తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి: ఏపీలో అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో సేవలందిస్తున్న వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) యూనివర్సిటీల్లో పాఠ్యాంశమయ్యాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, వెటర్నరీ, కళాశాల విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులుగా కూడా మారాయి. యూనివర్సిటీలు, అనుబంధ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులు ఇక నుంచి విధిగా ఆర్బీకేల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా మార్పుచేశారు. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విద్యార్థులు ఇందుకు శ్రీకారం చుట్టగా, మత్స్య యూనివర్సిటీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన ఈ ఆర్బీకేలు రెండున్నరేళ్లుగా రైతులకు విశేష సేవలందిస్తూ అంతర్జాతీయ మన్ననలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో సచివాలయాలకు అనుబంధంగా మొత్తం 10,778 ఆర్బీకేలను ఏర్పాటుచేశారు. వన్‌స్టాప్ సెంటర్‌గా వీటిని తీర్చిదిద్దారు. బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగుల మందులతోపాటు ఎరువులను రైతు ముంగిటకు సరఫరా చేస్తున్నారు.

విశాఖ ఉక్కులో భారీ పేలుడు

9 మందికి తీవ్ర గాయాలు

ఉక్కు నగరం/గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం చోటుచేసుకున్న భారీ పేలుడుతో విశాఖ నగరం ఉలిక్కిపడింది. ఈ ప్రమాదంలో 9 మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఇనుము ఉత్పత్తిలో భాగంగా స్లాగ్ పాట్ వెళ్లే ట్రాక్‌లో అవాంతరాలు ఏర్పడ్డాయి. వాటిని తొలగిస్తుండగా దాని కిందనున్న నీటిలో వేడిగా ఉన్న స్లాగ్ (ఖనిజం నుంచి లోహాన్ని వేరు చేయగా మిగిలిన ద్రవం) పడింది. దీంతో భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ మేనేజర్ జె.జయకుమార్ (34), టెక్నీషియన్లు బి.ఈశ్వర్ నాయక్ (36), పండా సాహు (36), డిప్యూటీ జనరల్ మేనేజర్ థాయ్‌వాలా (55), కాంట్రాక్ట్ కార్మికులు ఎస్.పోతయ్య (44), కె.శ్రీను (34), ఆర్.బంగారయ్య (34), ఆర్.సూరిబాబు (36), సీహెచ్.అప్పలరాజు (37) గాయపడ్డారు. శ్రీనుకు 90 శాతం, పోతయ్యకు 65 శాతం, డీజీఎం థాయ్‌వాలాకు 45 శాతం గాయాలైనట్టు వైద్యవర్గాలు తెలిపాయి. ఈ ముగ్గురి పరిస్థితి విషయంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. పేలుడు సమాచారం అందుకున్న సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగం సిబ్బంది క్షణాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

'మలక్ పేట' బాధ్యులపై చర్యలేవీ?

- ఇద్దరు గర్భిణులు మృతిచెందినా మౌనమే..
- ఇన్ఫెక్షన్, నిర్లక్ష్యంతో మరణించినట్లు నిర్ధారణ
- ప్రభుత్వానికి ఉన్నతాధికారుల నివేదిక

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు గర్భిణులకు సిజేరియన్ చేయడం.. వారికి ఇన్ఫెక్షన్ సోకిన అనంతరం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఘటనపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య విధాన పరిషత్ కమిషనర్‌డాక్టర్ అజయ్‌కుమార్, గాంధీ సూపరింటెండెంట్‌డాక్టర్‌రాజారావు, పేట్ల బురుజు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌మాలతితో కూడిన త్రిసభ్య కమిటీ దీనిపై వివిధ కోణాల్లో విచారణ చేసి ఇటీవలే సర్కారుకు తుది నివేదిక ఇచ్చింది. ఇన్ఫెక్షన్‌తోపాటు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఇద్దరు గర్భిణీలు మరణించినట్లు నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. ఈ ఘటనకు ప్రధానంగా ముగ్గురు వైద్య సిబ్బందిని బాధ్యులుగా పేర్కొన్నట్లు సమాచారం. అయినా ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.

అసలేం ఏం జరిగిందంటే...

జనవరి మొదటి వారంలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్లండ మండలం చెదుమపల్లికి చెందిన సిరివెన్నెల (23), హైదరాబాద్ పూసలబస్తీకి చెందిన శివాని (24) మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ చేయించుకున్నారు. అనంతరం వారి ఆరోగ్యం విషమించడంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు జనవరి 12న, మరొకరు 13న మరణించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే చనిపోయినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. బాలింతల మృతికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లే కారణమన్న వాదనలు కూడా వినిపించాయి. పోస్టుమార్టం రిపోర్టులో కూడా ఇన్ఫెక్షనే కారణమని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇందుకు ఆసుపత్రిలో పరిశుభ్రత లోపమే ప్రధాన కారణమని గుర్తించారు. గత ఆగస్టులో ఇబ్రహీంపట్నంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న నలుగురు మహిళలు మరణించిన తర్వాత వైద్య ఆరోగ్య శాఖ ఆసుపత్రి ఇన్‌ఫెక్షన్ నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయిందనడానికి మలక్‌పేట ఘటనను నిదర్శనంగా చెబుతున్నారు.

పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లుతో పాటు తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు–2023ని రాష్ట్ర శాసన సభ శనివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా రాష్ట్రంలో కొత్తగా ఆరు గ్రామ పంచాయతీల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. భద్రాచలం–కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలంలో కొత్తగా భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలు, బూర్గంపహాడ్ మండలంలో కొత్తగా సారపాక, ఐటీసీ గ్రామ పంచాయతీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలో కొత్తగా రాజంపేట గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయనున్నట్టు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభలో వివరించారు. ఈ రెండు బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించనున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై వాయిదా తీర్మానం తిరస్కరణ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్చ కోసం బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులు, నీటి వినియోగంపై చర్చ కోసం సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తిరస్కరించారు.

జోగులాంబ ఆలయంలో ఐజీ ప్రత్యేక పూజలు




జోగుళాంబ శక్తిపీఠం: అలంపురం శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శనివారం ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ తరుణ్ జోషి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారి పురేందర్‌కుమార్ పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు సీఐ సూర్యనాయక్, ఎస్ఐ మహేందర్ ఉన్నారు.

ఆలయానికి విరాళం..

అనంతరం శ్రీ జోగుళాంబ అమ్మవారి ఆలయానికి హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌కు చెందిన జగన్ మోహన్ గౌడ్, సుమలత దంపతులు కేజీ 450 గ్రాముల వెండి పళ్లెం సమర్పించారు. వీరితో పాటు స్థానిక నేత భూపాల్ ఉన్నారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన పుష్పాల అజయ్‌కుమార్ గౌరీ దంపతులు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రానికి రూ.50,111లు విరాళంగా అందించినట్లు ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వేములవాడకు శివభక్తుడి సైకిల్‌యాత్ర



ధరూరు: మండలంలోని మార్లబీడుకు చెందిన శివభక్తుడు శివరాజ్ అనే వ్యక్తి వేములవాడ రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని సైకిల్‌యాత్రగా వెళ్లి దర్శించుకునేందుకు శనివారం మార్లబీడు నుంచి గద్వాలకు బయలుదేరి వెళ్లాడు. అక్కడ రాత్రికి వీరభద్ర స్వామి ఆలయంలో బస చేసి ఆదివారం ఉదయం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకుని అక్కడి నుంచి మణ్యంకొండ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నట్లు శివరాజ్ తెలిపారు. గ్రామం నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు వేములవాడకు సైకిల్‌యాత్రగా వెళ్లారు. అక్కడి నుంచి బస్సు ప్రయాణం ద్వారా శ్రీశైలం చేరుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

మన్యంకొండలో భక్తజన సందోహం



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

- దాసంగాలతో స్వామివారికి నైవేద్యం
- భక్తులతో కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం శనివారం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల్లో విశేష సేవలు పూర్తయినప్పటికీ జాతర మాత్రం నెలరోజుల పాటు కొనసాగుతుంది. శని, ఆదివారాలతోపాటు సెలవు దినాల్లో దేవస్థానానికి వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా ఉంటుంది. ఇందులో భాగంగానే శనివారం కావడంతో భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మన్యంకొండ ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో పులకించిపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు మన్యంకొండకు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తులతో మన్యంకొండ దేవస్థానం జనసంద్రాన్ని తలపించింది. దిగువ కొండ, తేరు మైదానం, కోనేరు ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొంత మంది తలనీలాలు సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచే కోనేరు నుంచి గర్భగుడి వరకు భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు. అనంతరం భక్తులు పక్కనున్న శివాలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శేషవాహనసేవ

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి శేషవాహనసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేషవాహనంలో స్వామివారిని గర్భగుడి నుంచి రథాల మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. భక్తులు చేసిన హరినామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. బంగారు ఆభరణాలు, రకరకాల పూల అలంకరణలో స్వామివారు లైట్ల వెలుతురులో ధగధగ మెరిసిపోతూ శేషవాహనంలో ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి సేవను చూసి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. అనంతరం రథాల మంటపం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరిగి గర్భగుడికి తెచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



మన్యంకొండలో జనం



కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కనులపండువగా ఎల్లమ్మ రథోత్సవం



భక్తజన సందోహం మధ్య కదులుతున్న అమ్మవారి రథోత్సవం (ఇన్‌సెట్లో) రథంలో ఊరేగుతున్న అమ్మవారు

కోస్గి: పేదల కల్వపల్లి పోలేపల్లి ఎల్లమ్మదేవి రథోత్సవం శనివారం సాయంత్రం కనుల పండువగా జరిగింది. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు నిర్వహించిన రథోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన రథాన్ని పూలదండలతో అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఈఓ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారికి కల్లు సాక పట్టి, ప్రత్యేక పూజలు చేసి రథంలో ప్రతిష్ఠించి తేరులాగారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన రథోత్సవం శివసత్తుల పూనకాలు, డప్పుల మోత నడుమ గ్రామంలోని పురవీధుల గుండా సాగింది. అమ్మవారు తేరుపై నుంచి భక్తులకు దర్శనం ఇవ్వగా మొక్కులు తీర్చుకొని తరించారు. శుక్రవారం రాత్రంతా బుడగ జంగాలు, కుర్వ, గొల్ల యాదవులు, బైండ్లవారు జాగరణ చేస్తూ ఆలయ ప్రాంగణంలో ఎల్లమ్మ జీవిత చరిత్ర పురాణాన్ని భక్తులకు ఆటపాటల ద్వారా తెలియజేశారు. శుక్రవారం సిడె మహోత్సవానికి రాలేని మాంసాహారానికి దూరంగా ఉండే కొందరు భక్తులు శనివారం తమ మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో రంగుల రాట్నం, ప్రత్యేక మిఠాయిల దుకాణాలు సైతం భక్తుల రద్దీతో కళకళలాడాయి.

ఆకట్టుకున్న పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో పౌరాణిక పద్య నాటకోత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు చంద్రముఖి ఆర్ట్స్ అకాడమీ వారు శాస్త్రీయ నృత్యం, శ్రీకృష్ణ రాయభారం, అల్లూరి సీతరామరాజు ఏకపాత్రాభినయం నాటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీమిత్ర కళా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఏడేళ్లుగా మన్యంకొండ క్షేత్రంలో పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవస్థానం సహకారంతో ఈ నెల 23 వరకు నాటకోత్సవాలు కొనసాగిస్తామన్నారు. ఆదివారం స్వరలహరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయభారం, ధర్మజ రాజసూయం నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదనాచారి, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిరస నాటకం

జనతా సేవా సమితి ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన 'శ్రీభద్రాద్రి రామదాస చరితం' భక్తిరస నాటక ప్రదర్శన అలరించింది. వరకవుల నరహరిరాజు రచన, సంగీతం దర్శకత్వంలో నాటక ప్రదర్శన నిర్వహించగా పాత్రధారులు చక్కటి అభినయంతో ఆకట్టుకున్నారు. రామదాసుగా వీడీఎస్ రాజు, తానీషా నవాబుగా చిల్వేరు రామకృష్ణ, శ్రీరాముడిగా కట్టా నర్సింహులు, లక్ష్మణుడిగా తిరుపతయ్య, వార్తావాహుడుగా చిల్వేరు వెంకటయ్య, ఇబ్రహింఖాన్, కబీర్‌దాస్ పాత్రల్లో గడ్డం కిష్టప్ప, అక్కన్నగా ఎం.అంజిలయ్య, మాదన్నగా నిదురం సత్యనారాయణ, రఘునాథభట్టచార్యులుగా బోల అయోధ్య తమ పాత్రలకు జీవం పోశారు. అనంతరం వరకవుల నరహరిరాజు, కళాకారులను ఘనంగా సన్మానం చేశారు.



కళాకారుల నృత్య ప్రదర్శన

వైభవంగా తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



తిక్కవీరేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అయిజ: పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. శోభాయాత్రకు ముందు స్వామివారి రథాన్ని శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేకంగా అమర్చిన విద్యుత్ బల్బులతో స్వామివారి రథం ప్రత్యేక శోభను సంతరించుకుంది. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ప్రతిష్ఠించారు. అర్ధరాత్రి ఆలయ అర్చకుడి ఇంటి నుంచి భక్తులు కుంభం కాగు (మట్టి కుండల్లో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యం) తెచ్చి రథం చుట్టూ నైవేద్యాన్ని పొలి చల్లారు. స్వామివారి రథం వద్ద పలకల కోలాటం, నందికోళ్లసేవ, కట్టెల కోలాటంతో కళాకారులు వివిధ ప్రదర్శనలు చేశారు. బాణాసంచాతో ఆలయం ప్రాంగణం వివిధ రంగులతో వెలిగిపోయింది. అర్ధరాత్రి దాటిన తర్వాత భక్తులు తిక్కవీరేశ్వరస్వామి నామాన్ని స్మరించుకుంటూ రథాన్ని కదిలించారు. తాళ్లతో లాగుతూ రథాన్ని ఆంజనేయస్వామి ఆలయం వరకు తీసుకెళ్లి.. తిరిగి తిక్కవీరేశ్వరస్వామి ఆలయానికి తెచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



తిక్కవీరేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం